కాలిబూడిదైన ఎస్ఎస్వీ ఫ్యాబ్స్ పరిశ్రమ

- 30 గంటలు శ్రమించిన యంత్రాంగం
- జీడిమెట్లలోనే అతిపెద్ద ప్రమాదం
- ప్లాస్టిక్ వల్ల వేగంగా వ్యాపించిన మంటలు
- భయం గుప్పిట్లో కాలనీల ప్రజలు



ప్లాస్టిక్ నుంచి నల్లటి పొగలు రావడంతో కార్మికులు పరుగులు తీశారు.

జీడిమెట్ల: జీడిమెట్లలోని ఎస్ఎస్వీ ఫ్యాబ్స్లో జరిగిన అతి భారీ అగ్నిప్రమాదంలో పరిశ్రమ మూడు అంతస్తులు కుప్పకూలాయి. పరిశ్రమలో ఉన్న వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. దాదాపు 30 గంటల పాటు ప్రమాద తీవ్రత జరగడం జీడిమెట్లలో ఇదే మొదటిదని ఫైర్ అధికారులు తెలిపారు. మొత్తం 8 ఫైర్ ఇంజన్లు, ఒక స్కైలిఫ్టర్, 20 వాటర్ ట్యాంకర్లతో ప్రయత్నించినా మంటలు అదుపులోకి రాలేదు. నలుగురు డీఎఫ్లు, ఐదు ఫైర్స్టేషన్ల ఎస్ఎఫ్వోలతో పాటు సిబ్బంది, బాలానగర్ ఏసీపీ, జీడిమెట్ల పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు ఇంతమంది దగ్గరుండి పర్యవేక్షించాల్సి వచ్చింది అంటే ప్రమాద తీవ్రత ఎంత పెద్దదో తెలుస్తుంది. ఫైర్ సిబ్బంది అక్కడే దొరికింది తింటూ నిద్రలేకుండా దాదాపు 30 గంటల పాటు శ్రమించారు. పరిశ్రమలోని దాదాపు 2వేల టన్నుల ముడిసరుకు, ప్రొడక్షన్ యంత్రాలు, ప్లాస్టిక్ బ్యాగులు మొత్తం కాలిబూడిదయ్యే వరకు మంటలు చల్లారలేదు.

అగ్ని నియంత్రణ పరికరాలు లేవా?

దాదాపు పరిశ్రమ 2 ఎకరాల స్థలంలో ఉండగా 1.50 లక్షల చదరపు అడుగుల్లో పరిశ్రమ భవనం ఉంది. పరిశ్రమ లోపల కార్బన్డైఆక్సైడ్ సిలిండర్లు, బాల్స్ ఉన్నాయని యాజమాన్యం చెప్పినా అవేవి ప్రమాదాన్ని నివారించలేకపోయాయి. పరిశ్రమ మూడవ అంతస్తుపైన రేకులతో భారీషెడ్డు ఉంది. మంగళవారం మధ్యాహ్నం 12.30గంటలకు మొదటగా అగ్నిప్రమాదం అక్కడే ప్రారంభమైంది. అసలు ప్రమాదం ఎలా జరిగిందనే విషయాన్ని యాజమాన్యం గాని, కార్మికులు గాని బయటకు చెప్పడం లేదు.

220 కేవీ విద్యుత్ వైర్ల వల్లే ఆలస్యమా?

పరిశ్రమ ఆవరణలో నుంచి 220కేవీ విద్యుత్ లైన్ వెళ్లింది. మంటలు సైతం పరిశ్రమ మూడవ అంతస్తు ముందు భాగంలోనే అంటుకున్నాయి. ఫైర్ ఇంజన్లు సమయానికి వచ్చినా విద్యుత్ వైర్లు ఉండటంతో వారు అక్కడ నుంచి నీటిని పంప్ చేసేందుకు బయపడ్డారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రమాదం జరుగగా.. విద్యుత్ అధికారులు సాయంత్రం 5 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు తెలిపారు. అప్పటికే మంటలు రెండవ అంతస్తులోకి ప్రవేశించాయి. భారీ ఎత్తున ప్లాస్టిక్ నిల్వలు ఉండటంతో మంటలు అదుపులోకి రాలేదు. మంగళవారం రాత్రి 9గంటల తర్వాత పరిశ్రమకు చెందిన రెండు, మూడవ అంతస్తు స్లాబ్లు పది నిమిషాల వ్యవధిలోనే పెద్ద శబ్దంతో కూలిపోయాయి. దీంతో మంటలు మరింత వ్యాపించి లోపల ఉన్న ముడిసరుకుతో పాటు సాల్వెంట్లు అంటుకోవడంతో మంటలు అదుపులోకి రాలేదు. చుట్టుపక్కల పరిశ్రమల యాజమాన్యాలు బిక్కుబిక్కుమంటూ నిద్రలేని రాత్రి గడిపారు. ఎక్కడ మంటలు వారి పరిశ్రమలకు అంటుకుంటాయో అని వారంతా రాత్రి నీటి ట్యాంకర్లు, ఫోమ్ డబ్బాలను సిద్ధంగా ఉంచారు. ఫైర్ అధికారులు అప్పటికే చుట్టుపక్కల పరిశ్రమలకు మంటలు వ్యాపించకుండా తగిన చర్యలు తీసుకుని ఫైర్ ఇంజన్లను సిద్ధంగా ఉంచారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



ఎమ్మెల్యే వివేకానంద్కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం పేట్బషీరాబాద్లోని క్యాంప్ కార్యాలయంలో పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, అభివృద్ధి పనుల విషయంలో వెనుకడుగు వేసేది లేదన్నారు.

అయ్యప్ప మహాపడి పూజలో..

బీఆర్ఎస్ గాజులరామారం డివిజన్ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, కైసర్ నగర్లో కిషోర్యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజలో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్, నాయకులు బాల్రాజ్, కమలాకర్, ఇబ్రహీం ఖాన్, అజయ్గుప్తా, శివ కుమార్ పాల్గొన్నారు.



గౌడ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు గౌరీ శంకర్గౌడ్ దశదిన కార్యక్రమం బుధవారం చింతల్ డివిజన్ చంద్రనగర్లోని నివాసంలో జరిగింది. ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. గౌరీశంకర్ గౌడ్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కుటుంబాన్ని ఓదార్చారు. – చింతల్



అవినీతి తిమింగలాలు!

- టౌన్ప్లానింగ్, జీపీల్లో చేతి వాటం ప్రదర్శిస్తున్న పలువురు ఉద్యోగులు
- పురపాలక సంఘాలు, పంచాయతీల్లో అక్రమ కట్టడాల జోరు
- సర్కారు ఆదాయానికి భారీగా గండి
- జీహెచ్ఎంసీ సర్కిళ్లలోనూ పార్కుల కబ్జా
- అటకెక్కిన పర్యవేక్షణతో ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లోనూ నిర్మాణాలు

నగర శివారు పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో భవన నిర్మాణాల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ఎక్కడ చూసినా బహుళ అంతస్తుల జోరు కనిపిస్తోంది. చిన్న వీధుల్లో కూడా మూడు, నాలుగు అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. కనీసం అగ్నిమాపక యంత్రాలు తిరిగేలా స్థలాలు ఉండాలన్న విషయాన్ని ఆయా ఇళ్ల యజమానులు మర్చిపోతున్నారు. పైగా ఇంటికి ఆనుకుని కొత్త భవన నిర్మాణాలు చేపడుతున్నారు. భవిష్యత్లో జరగరాని ఘటనలు జరిగితే ఎవరు బాధ్యులనే విషయాన్ని కూడా ఎవ్వరూ పట్టించుకోవటం లేదు. అక్రమ నిర్మాణదారుల నుంచి పెద్ద మొత్తంలో ఉద్యోగులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

– సాక్షి, సిటీబ్యూరో

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనతో...

అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)దరఖాస్తుల విచారణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాలతో ఇరిగేషన్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ శాఖలు క్షేత్ర స్థాయి పరిశీలనకు శ్రీకారం చుట్టాయి. మేడ్చల్ జిల్లాలో ఇష్టానుసారంగా వెలుస్తున్న అక్రమ కట్టడాలు, లే అవుట్లతోపాటు రోడ్లు, పార్కులను కబ్జా చేసి నిర్మిస్తున్న భవనాలు, బహుళ అంతస్తులు, ఇండిపెండెంట్ ఇళ్లు వెలుగులోకి వస్తున్నాయి. పనుల ఒత్తిడి, పలు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో సంబంధిత అధికారులు వీటిపై దృష్టి సారించకపోవటంతో కొందరు ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పెద్ద మొత్తంలో వసూళ్లు

నిర్మాణదారుల నుంచి అడ్డగోలుగా పలువురు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు అక్రమంగా వసూలు చేస్తున్న అమ్యామ్యాలను పర్సెంటేజీల రూపంలో టౌన్ప్లానింగ్, ఎంపీఓలు నుంచి మొదలుకొని పురపాలక, పంచాయతీ శాఖ అధికారుల వరకు వెళ్తున్నట్లు ఆ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. వెంచర్లలో ఎకరానికి రూ. లక్ష నుంచి ఏరియాను బట్టి రూ.3 లక్షల వరకు పలువురు ఉద్యోగులు వసూలు చేసినట్లు తెలుస్తోంది.

అక్రమ నిర్మాణాలు.. మచ్చుకు కొన్ని..

శామీర్పేట, ఎంసీపల్లి మండలాల పరిధిలోని లింగాపూర్ తండా, లక్ష్మాపూర్, మజీద్పూర్, దేవరయాంజల్, కోల్తూర్ తదితర ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ఫామ్ల్యాండ్, అక్రమ వెంచర్లు వెలిసినా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. బోడుప్పల్, పీర్జాదిగూడ, నాగారం, దమ్మాయిగూడ, జవహర్నగర్లో ప్రతీ రోజు ఏదో ఒక డివిజన్లో అక్రమ కట్టడాలు జరుగుతూనే ఉన్నాయి. పురపాలికల్లో ఇటీవల విలీనమైన గ్రామ పంచాయతీలతో పాటు ప్రస్తుత జీపీల్లో కూడా అక్రమ కట్టడాలు, లే అవుట్లు కొనసాగుతున్నాయి. శామీర్పేట్, బొమ్మరాసిపేట, మూడుచింతలపల్లి, తుర్కపల్లి, బాబాగూడ, అంకిరెడ్డిపల్లి, భోగారం, కీసర, చీర్యాల, గోధుమకుంట, తిమ్మాయిపల్లి, యాద్గార్పల్లి, అలియాబాద్, లింగాపూర్ తండా, చౌదరిగూడ, కొర్రెముల, కాచవాని సింగారం, నూతనకల్లు, రాయిల్పూర్, సైదోనిగడ్డ తండాలలో పెద్ద ఎత్తున అక్రమ కట్టడాలు, లేఅవుట్లు నిర్మిస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదు.

సర్కిళ్ల పరిధిలోనూ..

మేడ్చల్ జిల్లా పరిధిలోని జీహెచ్ఎంసీ సర్కిళ్ల పరిధిలో కూడా పార్కులు, రోడ్లు ఆక్రమించి అక్రమ కట్టడాలు వెలిసినట్లు గుర్తించారు. జిల్లాలోని ఉప్పల్ సర్కిల్లో 1989 చదరపు గజాలు, కాప్రా సర్కిల్లో 194 చదరపు గజాలు, మల్కాజిగిరి సర్కిల్లో 36 చదరపు గజాలు, మూసాపేట్లో 20, కూకట్పల్లిలో 455, కుత్బుల్లాపూర్లో 62, గాజుల రామారంలో 198, అల్వాల్ సర్కిల్లో 155 చదరపు గజాల స్థలం ఆక్రమణకు గురయ్యాయి. ప్రభుత్వ స్థలాలు, అసైన్డ్ భూముల్లో వెలుస్తున్న నిర్మాణాలపై అధికార యంత్రాంగం సీరియస్గా ఉన్నా దందా మాత్రం ఆగడం లేదు.

గుర్తించిన అక్రమ కట్టడాలివే

మేడ్చల్ జిల్లాలో గతంలో గుర్తించిన అక్రమ కట్టడాల వివరాలు పురపాలక సంఘాల వారిగా ఇలా ఉన్నాయి. నాగారంలో 12 అక్రమ లేఅవుట్లు, బోడుప్పల్లో 107, పీర్జాదిగూడలో 67, దమ్మాయిగూడలో ఏడు, మేడ్చల్లో 10, నిజాంపేట్లో 20, కొంపెల్లిలో 11, దుండిగల్లో 12,, తూముకుంటలో 15, పోచారంలో 12, ఘట్కేసర్లో 8, కీసర మండలంలో 265, శామీర్పేట్లో 185, మేడ్చల్లో 72, ఘట్ కేసర్లో 67, ఎంసీపల్లి మండలంలో 89 అక్రమ కట్టడాలు, లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించారు.

కళాశాలలో మాక్ అసెంబ్లీ

కుత్బుల్లాపూర్: చింతల్ భాగ్యరథి జూనియర్ కళాశాలలో బుధవారం మాక్ అసెంబ్లీని నిర్వహించారు. ఇందులో భాగంగా సీఎం, ప్రతిపక్ష నాయకుడు స్పీకర్లను ఎన్నుకునేందుకు ప్రత్యక్షంగా ఎన్నికలు నిర్వహించారు. సీనియర్ విద్యార్థులు అర్జున్ మౌర్య, ప్రేమ్ కుమార్, సాయి చరణ్, మహ్మద్ అఫ్రోజ్ మహ్మద్ తాజుద్దీన్, బిలాల్ ఎలక్షన్లో పోటీ చేశారు. ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ, 26న సింబల్స్ కేటాయింపు, ప్రచారం, 27వ తేదీన బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించారు. 175 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఓటింగ్ ప్రారంభించగా.. మహ్మద్ తాజుద్దీన్ 81 ఓట్లతో ప్రథమ స్థానంలో నిలిచి సీఎం అభ్యర్థిగా ఎంపికయ్యారు. ప్రేమ్ కుమార్ 36 ఓట్లతో ద్వితీయ స్థానంలో నిలిచి ప్రతిపక్ష నేతగా, మహ్మద్ బిలాల్ 26 ఓట్లతో స్పీకర్గా ఎంపిక అయ్యారు. అనంతరం మాక్ అసెంబ్లీ నిర్వహించి విద్యార్థులు అబ్బుర పరిచారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ఎస్.వెంకట్రెడ్డి, గోవిందరెడ్డి, జి.రమేష్ బాబు, కె.రామకృష్ణ, నల్ల జైశంకర్గౌడ్, అధ్యాపక బృందం సభ్యులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలి



కమిషనర్కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నిజాంపేట్: ప్రగతినగర్ శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలని సీపీఎం నాయకులు బుధవారం కమిషనర్ సాబేర్ అలీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం బాచుపల్లి మండల కార్యదర్శి వెంకటరామయ్య మాట్లాడుతూ.. అధికారుల నిర్లక్ష్యం వల్ల శ్మశాన వాటిక స్థలం చెత్త డంపింగ్ యార్డుగా మారిందన్నారు. సదుపాయాలు కల్పించి శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలన్నారు. గదులు ఉన్నా కిటికీలు లేవని, తాగునీటి వసతి, ఇతర వసతులు కల్పిస్తే ప్రగతినగర్ సమీప ప్రాంత వాసులు దహన సంస్కారాలు చేయడానికి వీలుగా ఉంటుందన్నారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ.. శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేశామని, సిబ్బందితో శుభ్రం చేయించి సదుపాయాలను మెరుగు పరుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, బాల వెంకటేశ్వర రావు, సంతోష్, వెంకటరాజ్యం, ప్రభాకర్, వీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

సోషలిజం కోసం యువత ఆలోచించాలి



జగన్మోహన్ సింగ్కు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

భగత్సింగ్ మేనల్లుడు, ప్రొఫెసర్ జగన్మోహన్సింగ్



భగత్సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జగన్మోహన్ సింగ్

జగద్గిరిగుట్ట: భగత్ సింగ్ కలలుగన్న సోషలిజం కోసం యువత, విద్యార్థిలోకం ఆలోచించాలని భగత్సింగ్ మేనల్లుడు, ప్రొఫెసర్ జగన్మోహన్ సింగ్ అన్నారు. నియోజకవర్గంలోని గాంధీనగర్, జగద్గిరిగుట్ట, మగ్దూం నగర్, భగత్ సింగ్ మార్గ్ ప్రాంతాల్లో ఉన్న భగత్సింగ్ విగ్రహాలకు పూలమాలలు వేసి షాపూర్నగర్ విన్ పాలస్ ఫంక్షన్హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భగత్సింగ్ చిన్నతనం నుంచే సమాజంలో జరిగిన అన్యాయాలను ప్రశ్నిస్తూ, వాటికి శాస్త్రీయమైన సమాధానాలు రాబట్టేవారని అన్నారు. మతం, కులం, లింగ బేధం వంటివి మనుషులను విభజించడానికే ఉపయోగపడతాయని, అలాంటి వాటికి దూరంగా ఉండాలని ఆనాడే భగత్సింగ్ చైతన్యం చేశారన్నారు.

ఘన స్వాగతం

గాంధీనగర్లో ఠాగూర్ పాఠశాల విద్యార్థులు, జగద్గిరిగుట్ట, భగత్ సింగ్మార్గ్లో సీపీఐ నాయకులు, విన్ పాలస్ ఫంక్షన్ హాల్లో నేతాజీ విద్యార్థులు ఆయనకు ఘనం స్వాగతం పలికారు. సంఘమిత్ర, పటేల్, ఫ్రీడమ్, నాగార్జున, సాధన, బాపూజీ పాఠశాల విద్యార్థులు దేశభక్తి పాటలకు నృత్యం చేశారు. పోటీలో గెలిచిన వారికి బహుమతులను అందచేశారు. ప్రజానాట్యమండలి అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఉప్పలయ్య, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, భాస్కర్ బృందం, వెంకటాచారి బృందం దేశభక్తి పాటలు పాడి విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి ఉమా మహేష్, నాయకులు కిషన్, వరప్రసాద్, ఏసురత్నం, హైమావతి, శ్రీనివాస్, కృష్ణ, మోహన్ బైరాగి, జతిన్, రచయిత దీవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు

నిజాంపేట్: మినిస్ట్రీ ఆఫ్ స్మాల్ ఇండస్ట్రీస్ (ఎంఎస్ఎంఈ) ఆధ్వర్యంలో యువతకు రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మిషన్లు, వాటర్ ప్యూరిఫైయర్స్, డిష్ వాషర్స్ రిపేర్లపై టెక్నికల్ ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు ఎంఎస్ఎంఈ మేనేజర్ మారుతీ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు జరిగే శిక్షణ తరగతుల్లో పాల్గొనేందుకు టెన్త్ పాసై 18 నుంచి 25 సంవత్సరాల లోపు వయసున్న వారు అర్హులని పేర్కొన్నారు. చేరాలనుకునే వారు రెండు రోజుల్లో ఇతర వివరాలకు 63037 82424 నెంబర్లో సంప్రదించాలని తెలిపారు.

అక్రమ నిర్మాణం.. అధికారుల చోద్యం

- దేవి భూమినగర్లో భారీ షెడ్ల నిర్మాణం
- ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుకు లక్షల్లో డీల్!
- స్థానికులు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం





దేవ భూమినగర్లో అక్రమంగా నిర్మిస్తున్న భారీ షెడ్లు

ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుకు లక్షల్లో ఒప్పందం?

కుత్బుల్లాపూర్: గాజులరామారం సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. పైగా అధికారులు ఫిర్యాదు ఆధారంగా అక్రమ నిర్మాణదారుల నుంచి మరింత డబ్బు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేవ భూమి నగర్ ప్రాంతంలో సుమారు ఎకరం స్థలంలో రెండు అక్రమ నిర్మాణాలకు అధికారులు అండగా ఉండటంతో గ్రేటర్ ఆదాయానికి భారీగా గండి పడిందన్న చర్చ జరుగుతోంది. గతంలో ఇక్కడ నిర్మాణాలు చేపడుతున్న క్రమంలో ఫిర్యాదులు చేస్తే సంబంధిత అధికారులు పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు. అక్రమ షెడ్లకు ఎటువంటి అనుమతులు లేకున్నా విద్యుత్ కనెక్షన్, సర్కిల్ అధికారులు ఇంటి నెంబర్ సైతం ఇవ్వడం విశేషం. గతంలో ఇక్కడ పనిచేసి వెళ్లిన టౌన్ ప్లానింగ్ అధికారి అందరిని మేనేజ్ చేస్తానని భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా గ్రేటర్ ఆదాయానికి గండిపడేలా వ్యవహరించే ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

అక్రమంగా నిర్మించిన ఓ షెడ్డుకు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు కోసం ఉషా ముళ్లపూడి సెక్షన్ అధికారులకు ఓ విద్యుత్ కాంట్రాక్టర్ సుమారు ఐదు లక్షలు ఒప్పందం చేసుకొని ఫైల్ కదిలిస్తున్నట్లు తెలిసింది. దీనికి మేడ్చల్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహించే ఓ అధికారి కనుసన్నల్లో ఫైల్ ఎస్పీ సెక్షన్లో ఉన్నట్లు సమాచారం. ఇదే విషయంపై కుత్బుల్లాపూర్ ఏడీఈ శ్రీకాంత్ ను 'సాక్షి' వివరణ కోరగా.. తాము ఇప్పటి వరకు అనుమతి ఇవ్వలేదని, ఫైలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని ఆయన చెప్పడం విశేషం.

అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం



సర్కిల్ 26 పరిధిలోని భారీ షెడ్ల నిర్మాణానికి ఎటువంటి అనుమతి లేదు. ఇప్పటికే ఫిర్యాదులు వచ్చాయి. గ్రేటర్ ఆదాయానికి గండి పడేలా వ్యవహరించే ఏ అక్రమ నిర్మాణాన్ని వదిలే ప్రసక్తే లేదు. వాటిని కూల్చివేయడం లేదా సీజ్ చేయడం జరుగుతుంది.

– మల్లారెడ్డి, డిప్యూటీ కమిషనర్

7, 8 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు



వాల్పోస్టర్ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: ప్రగతినగర్లో డిసెంబర్ 7, 8 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. బుధవారం షాపూర్నగర్ కార్యాలయంలో జిల్లా మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాసభలో మూడు సంవత్సరాలుగా నిర్వహించిన పోరాటాలను సమీక్షించి, భవిష్యత్లో చేపట్టాల్సిన ఉద్యమాలపై చర్చిస్తామన్నారు. ప్రజలకు వైద్య, విద్య, ఉపాధి అవకాశాలను మెరుగు పరిచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పసుల అంజయ్య, రావుల స్వాతి, కరుణాకర్, దేవదానం, కనయ్య, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లి, తండ్రి లేని విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లింపు



పరీక్ష ఫీజు చెల్లిస్తున్న బుచ్చిరెడ్డి

కుత్బుల్లాపూర్: సూరారం ప్రభుత్వ పాఠశాలలోని తల్లి, తండ్రి లేని 20 మంది విద్యార్థుల పదవ తరగతి పరీక్ష ఫీజును కాంగ్రెస్ నాయకుడు బుచ్చిరెడ్డి బుధవారం చెల్లించారు. పదవ తరగతి పరీక్ష ఫీజు కట్టడానికి విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు విజయ్ కుమార్ కాంగ్రెస్ నాయకుడి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన తక్షణమే స్పందించారు. పరీక్ష ఫీజును హెచ్ఎం పురుషోత్తంకు చెల్లించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణస్వామి వ్రతం



రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయ ఆవరణలోని కనకదుర్గమ్మ ఆలయంలో బుధవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. దంపతులు పెద్ద సంఖ్యలో హాజరై సత్యనారాయణ వ్రతకల్పాన్ని ఆచరించి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

దుండిగల్: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ గడ్డం మల్లేశ్ అన్నారు. దుండిగల్లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో 'గైడ్ టూ హెల్ప్ అండ్ సైబర్ డిఫెన్స్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలకు సమాధానం ఇవ్వకూడదన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు, డీన్ రాధికాదేవి, హెచ్ఓడీలు బలరాం, సాయి ప్రసాద్, రాజశేఖర్రెడ్డి, సుభాషిణి, చిరంజీవి, కో ఆర్డినేటర్ వేద విద్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేయాలి

నిజాంపేట్: ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గానికి మొండి చేయి చూపిందని బీజేపీ ప్రగతినగర్ అధ్యక్షుడు నరేంద్రచౌదరి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు రెండవ దశలో భాగంగా 26 పాఠశాలలను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 21న విడుదల చేసిన జీవోలో కుత్బుల్లాపూర్కు తీరని అన్యాయం జరిగిందన్నారు. మేడ్చల్ జిల్లాలోనే అతిపెద్ద కార్పొరేషన్గా ఉన్న నిజాంపేట్ ప్రాంత వాసులు ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్, బీసీ హాస్టల్, సాంఘిక సంక్షేమ ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లకు నోచుకోవడం లేదన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వసూలు చేస్తున్న ఫీజుల భారాన్ని తట్టుకోలేక ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే కార్పొరేషన్ పరిధిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ర్యాగింగ్కు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్, హాజరైన విద్యార్థులు

నిజాంపేట్: ర్యాగింగ్కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కూకట్పల్లి ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం బాచుపల్లిలోని బీవీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో బాచుపల్లి సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ర్యాగింగ్ –దుష్ప్రభావంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీనియర్ విద్యార్థులు జూనియర్లతో సోదరభావంతో మెలగాలని, ర్యాగింగ్ పేరుతో వారిని ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. ర్యాగింగ్తో అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయని, దానికి దూరంగా ఉండి బంగారు భవిష్యత్కు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీవీఆర్ఐటీ కళాశాల అధ్యాపక బృందం, మేనేజ్మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లిన వృద్ధుడి అదృశ్యం



పెంటయ్య

దుండిగల్: ఆసుపత్రికి వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. డి.పోచంపల్లి మాధవరం కాలనీకి చెందిన జి.పెంటయ్య(74) ఇంటి వద్ద ఉంటున్నాడు. ఆరోగ్యం బాగా లేకపోవడంతో బుధవారం ఉదయం దుండిగల్లోని ఓ ఆసుపత్రికి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి వెళ్లి విచారించగా.. ఓపీ తీసుకొని వెళ్లిపోయాడని చెప్పారు. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పెంటయ్య కోడలు రేఖ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.